


## రెయిలింగ్ ఇలా.. భద్రత ఎలా?

అనకాపల్లి నుంచి పెందుర్తి వెళ్లే దారిలో అనకాపల్లి సమీపాన వంతెన రెయిలింగ్ విరిగిపోయింది. ఇది దెబ్బతిని నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అదే దారిలో నిత్యం కలెక్టరుతో పాటు జిల్లా ఉన్నతాధికారులు ప్రయాణిస్తుంటారు. అయినా ఇంత పెద్ద ప్రమాదాన్ని పక్కనే పెట్టుకుని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– ఈనాడు, అనకాపల్లి

# కష్టానికి గుర్తింపు.. పదవుల్లో ప్రాధాన్యం కూటమి ఖుషీ

**కూటమి విజయానికి క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసిన నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వం కొలువుతీరి వంద రోజులు పూర్తయిన వేళ రాష్ట్రంలో పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు సభ్యులను నామినేట్ చేశారు. అందులో అనకాపల్లి, అరకు పార్లమెంటు పరిధిలోని పలువురు నేతలకు చోటుదక్కింది.**

ఈనాడు, అనకాపల్లి

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పొత్తుకోసం సీట్లు త్యాగం చేసిన సమన్వయకర్తలకు నామినేట్ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి ఇద్దరికి కార్పొరేషన్ ఛైర్మన్లగా అవకాశం కల్పించగా మరో అయిదుగురిని డైరెక్టర్లుగా నియమించారు. తెదేపాతో పాటు భాజపా, జనసేన పార్టీలకు కూడా ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు సామాజిక వర్గాలపరంగా సమన్యాయం పాటించారు. తర్వాత దశలో మరిన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని, పార్టీకి పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఇప్పుడు అవకాశం దక్కని నేతల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి.

### పీలాకు పెద్దపీట..


కశింకోటలో పీలాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, బుద్ధ, కూటమి నేతలు

అనకాపల్లి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణకు నామినేట్ పదవుల్లో ప్రాధాన్యం దక్కింది. పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా ఆయన్ని నియమించారు. 2014-19 వరకు అనకాపల్లి ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పోటీకి సన్నద్ధమవుతున్న వేళ పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును జనసేన పార్టీకి కేటాయించారు. అయినా నిరాశ చెందకుండా కూటమి ప్రభుత్వ విజయమే లక్ష్యంగా జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ వెన్నంటే నడిచారు. ఆయన గెలుపు బాధ్యతలను భుజాన వేసుకున్నారు. మూడు పార్టీలనూ సమన్వయం చేస్తూ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించారు. ఎన్నికల ప్రచార సభల్లోనే తెదేపా, జనసేన అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు పీలాను అభినందించారు. తాజాగా నామినేటెడ్ పదవి ఇచ్చి మరింత గుర్తింపునిచ్చారు.

### తాతయ్యబాబుకు డబుల్ గుర్తింపు..

చోడవరం, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాదికి చెందిన బత్తుల తాతయ్యబాబు ఎన్నికల ముందు వరకు చోడవరం నియోజకవర్గం తెదేపా సమన్వయకర్తగా కొనసాగారు. సీట్ల కేటాయింపునకు వచ్చేసరికి సమీకరణాలు మారి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజునే బరిలో నిలిపారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి తాతయ్యబాబు కూటమి అభ్యర్థి విజయానికి కలిసికట్టుగా పనిచేశారు. ఆయన నిబద్ధతను గుర్తించి అప్పుడే అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షునిగా నియమించారు. జనసేనతో సమన్వయం చేసుకుంటూ ముందుకువెళ్లి చోడవరంలో కూటమి అభ్యర్థి రాజు భారీ విజయం సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన సేవలు గుర్తించి తాజాగా రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (ఏపీ హౌసింగ్ బోర్డు) ఛైర్మన్‌గా నియమించడంతో తాతయ్యబాబుకు డబుల్ గుర్తింపు ఇచ్చినట్లయింది. ఛైర్మన్ పదవి దక్కడంపై పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆయన్ను వడ్డాదిలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు కలిసి సత్కరించారు. తాతయ్యబాబు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ సీఎం చంద్రబాబును కలిసేందుకు విజయవాడ వెళ్తున్నట్లు చెప్పారు.


తాతయ్యబాబుకు మిఠాయి తినిపిస్తున్న కార్యకర్తలు

### శివశంకర్‌కు ఛైర్మన్‌గిరి


శివశంకర్‌ను అభినందిస్తున్న జనసేన నాయకులు సతీష్, ఆనంద్, సూర్యప్రసాద్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జనసేన రాష్ట్ర కార్యదర్శి టి.శివశంకర్‌ను ఏపీ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించారు. దీనిపై జనసేన కార్యకర్తలు, నాయకుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అచ్యుతాపురానికి చెందిన నాయకులు శివశంకర్‌ను ఆయన గృహంలో కలిసి అభినందించారు. కష్టపడి పనిచేసిన నాయకులకు పార్టీలో గుర్తింపు ఉంటుందనే విషయం శివశంకర్‌కు పదవి ఇవ్వడం ద్వారా రుజువైందని జనసేన అనకాపల్లి పార్లమెంటు కార్యనిర్వహణ కమిటీ సభ్యుడు కట్టెంపూడి సతీష్ తెలిపారు. నాయకులు దువ్వాడ సూర్యప్రసాద్, లక్కరాజు ఆనంద్ పాల్గొన్నారు.

### పర్యటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా పీవీజీ కుమార్



మాడుగుల, న్యూస్‌టుడే: మాడుగుల నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పీవీజీ కుమార్ రాష్ట్ర పర్యటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వైకాపాలో ఉన్న ఆయన 2021 తర్వాత తెదేపాలో చేరి క్రియాశీలకంగా వ్యవహరించారు. జగన్ ప్రభుత్వం చంద్రబాబును అరెస్టు చేసి 53 రోజులు జైలులో ఉంచినప్పుడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఆశించినా.. అధిష్ఠానం మరో నాయకుడు పైలా ప్రసాదరావు కేటాయించడంతో కినుక వహించారు. చివరి నిమిషంలో బండారు సత్యనారాయణమూర్తి తెరపైకి రావడం, టికెట్ ఆయనకు దక్కడంతో.. గెలుపు కోసం కుమార్ పనిచేశారు.

### పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శివదత్



పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఏపీ పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బోడపాటి శివదత్ నియమితులయ్యారు. ఆయన జనసేన రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన శివదత్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి కేటాయించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లకు కృతజ్ఞతలు చెప్పారు.

# ఎక్కడ చూసినా 'గం'జాయి'

**రామాపురం కాలనీకి చెందిన నీలగిరి హరీష్ (25) గంజాయి అమ్ముతున్నాడని పోలీసులకు సమాచారం అందిందింది. జిల్లాకేంద్రం పరిసర ప్రాంతాల్లో గంజాయికి అలవాటు పడిన వారికి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నలుగురు యువకులకు సరకు ఇస్తుండగా ఇతనిని పోలీసులు పట్టుకున్నారు.**

**ప్యాకెట్ల రూపంలో అమ్మకాలపై నిఘా**


చిన్నచిన్న ప్యాకెట్లలో అమ్మకాలు



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

గంజాయికి యువత బానిసవుతున్నారు. ఇటీవల అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన పొగాకు నియంత్రణ విభాగానికి గంజాయికి అలవాటు పడ్డ యువకులు ఎక్కువగా వస్తుండటం సమస్య తీవ్రతను తెలుపుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనకాపల్లి గంజాయి రవాణా కేంద్రంగా మారింది. పోలీసులు దాడులు చేసి పట్టుకున్నా ఏజెన్సీ నుంచి అధిక సంఖ్యలో గంజాయి తరలిపోయేది. దీనికి అడ్డుకట్ట వేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల కాలంలో దాడులను ముమ్మరం చేయడంతో గంజాయి భారీగానే పట్టుబడుతోంది. ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకొచ్చి వాటిని ప్యాకెట్లుగా కట్టి అమ్మకాలు చేస్తున్నారు. పోలీసుల తనిఖీలతో ఈ తరహా అమ్మకాలు వెలుగుచూడడంతో వీటికి అడ్డుకట్ట వేసే పనిలో పడ్డారు. ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే తెలిపితే వివరాలు గోప్యంగా ఉంచి విచారణ చేసి నిందితులను పట్టుకుంటామని పోలీసులు ప్రచారం చేస్తున్నారు.

**గంజాయిని సీసాలో నింపి దానికి గొట్టాలు పెట్టి తాగుతున్నట్లు గుర్తించారు. మైకంలోకి వెళ్లేందుకు ఈ తరహా అలవాట్లను అనుసరిస్తున్నారు. వీరికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.**


సీసాకి ఇలా గొట్టంలా పెట్టి గంజాయి పీలుస్తూ...

**నిరంతర నిఘా**



చిన్నచిన్న ప్యాకెట్లతో గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించి దానిపై ఆరా తీస్తున్నాం. అనకాపల్లిలో ఏ ప్రాంతాల్లో అమ్మకాలు చేస్తున్నారు. ఎవరు కొనుగోలు చేస్తున్నారన్న దానిపై నిఘా పెంచాం. గంజాయి అమ్మకాలను పూర్తిగా అరికట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

– విజయ్‌కుమార్, అనకాపల్లి పట్టణ సీఐ


ఇటీవల పట్టుబడిన గంజాయితో ఎస్పీ దీపిక, సిబ్బంది

# మత్స్యకారుల ఉపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు


మ్యాప్ చూస్తూ ఎన్ఏఓబీ ప్రాంత సమస్య తెలుసుకుంటున్న హోంమంత్రి అనిత, కలెక్టర్ విజయ, ఎస్పీ దీపిక

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలంలో ఎన్ఏఓబీ పరిధిలోని మత్స్యకారుల ఉపాధికి ఏ ఇబ్బంది లేకుండా చూడాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. సారిపల్లిపాలెంలోని తన నివాసంలో మంగళవారం సాయంత్రం కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపికతో కలిసి వాకపాడు, బంగారమ్మపాలెం, వాతాడ గ్రామాలకు చెందిన ఎన్ఏఓబీ నిర్వాసితులతో సమావేశమయ్యారు. స్థానిక మత్స్యకార నాయకులు మాట్లాడుతూ దేశ రక్షణ నిమిత్తం తమ భూములను ఇచ్చామని, తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని వివరించారు. జెట్టీ నిర్మాణం, ఉపాధి అవకాశాలు లేవన్నారు. వీటిపై దృష్టిసారించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ విన్నవించారు. గతంలో సంబంధిత అధికారులు తమపై కేసులు పెట్టారని వీటి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఈ మేరకు అక్కడి ప్రాంతాన్ని చిత్రపటం(మ్యాప్) ద్వారా పరిశీలించిన అనిత కేసుల విషయమై ఎస్సై విభీషణరావుతో మాట్లాడి తెలుసుకున్నారు. జెట్టీ నిర్మాణంతోపాటు కేసుల ఇబ్బంది లేకుండా చూడాలని, ఉపాధి విషయంలో తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. ఈ అంశాలను గ్రామస్థులకు వివరించి అదనపు వినతులు ఉంటే వెల్లడించడానికి మరోమారు సమావేశం ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరగా, మంత్రి అంగీకారం తెలిపారు. ఆర్డీఓ జయరాం, డీఎస్పీ మోహన్, తెదేపా మండలాధ్యక్షుడు అమలకంటి అబద్ధం, సర్పంచి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు మాధవ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాలో 36 మంది ఉపతహసీల్దార్లు, ఐదుగురు టైపిస్టులు, 14 మంది సీనియర్, 11 మంది జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులిచ్చారు.**


ఏఎస్‌పేటలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కొణతాల, పీలా తదితరులు

### స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా రాష్ట్రాభివృద్ధి

కశింకోట, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కశింకోట మండలం ఏఎస్‌పేట గ్రామంలో 100 రోజుల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను కూటమి నాయకులు సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావుతో కలిసి పొలం పిలుస్తోంది గోడ పత్రికను ఆవిష్కరించారు. నాయకులు కాయల మురళీధర్, గొంతిన శ్రీనివాసరావు, గొంతిన రమణాజీ, కర్రి సత్యనారాయణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అడిగేవారు లేరు.. అడ్డుకునేవారు లేరు!

**సర్వే నంబరు 283 ప్రభుత్వ స్థలంలో దర్జాగా భారీ నిర్మాణం**



### కొత్తతలారివానిపాలెంలో ప్రభుత్వ స్థలం కబ్జా

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

భూబకాసురులు రెచ్చిపోతున్నారు. కొండపోరంబోకు స్థలాలు, గెడ్డలు, వాగులు కబ్జా చేసి యథేచ్ఛగా అమ్మకాలు చేసి కోట్లు కొల్లగొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అడ్డుకునేవారు లేకపోవడంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.

అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ శివారు కొత్తతలారివానిపాలెంలో సర్వే నంబరు 283లో వందల ఎకరాల ప్రభుత్వ కొండపోరంబోకు స్థలం ఉంది. ఇటీవల కొంత మంది భూబకాసురులు రెండు ఎకరాల మేర స్థలాన్ని యంత్రాల సహాయంతో రాత్రికి రాత్రి దున్నేసి జీడి, మామిడి చెట్లను నరివేసి వచ్చిన కలపను సైతం మాయం చేశారు. 10 నుంచి 20 సెంట్లు మేర స్థలాలను మార్కింగ్ చేసి దర్జాగా అమ్మకాలు చేస్తున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ.5 లక్షలు మేర పలుకుతుంది. రాత్రి వేళల్లో యంత్రాల సహాయంతో తవ్వకాలు సాగుతున్నాయి. గ్రావెల్‌ను సైతం అమ్మకాలు చేస్తున్నారు.


చదును చేసి అమ్మకానికి సిద్ధం చేసిన స్థలం

ఈ స్థలాలను కొనుగోలు చేసిన కొందరు పునాదులు తీసి నిర్మాణాలు చేపడుతున్నారు. బహిరంగంగానే ఈ తంతు జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులు రెచ్చిపోతుండడంతో ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈ స్థలాన్ని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఏర్పాటుకు అప్పటి అధికారులు పరిశీలించారు. ఇది ముందుకు సాగకపోవడంతో అందొచ్చిన స్థలాలను ఆక్రమించుకోడానికి కొందరు పోటీపడుతున్నారు. తక్షణమే వీరిపై చర్యలు చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.

**ఆక్రమణలు పరిశీలిస్తాం: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు పరిశీలించి తొలగిస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్రీరామ్మూర్తి తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి నివేదికలు సిద్ధం చేశామన్నారు. పోలీసుల సహకారంతో వీటిని కూడా తొలగిస్తామని చెప్పారు.**

### జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారులు సిద్ధం


పోటీల్లో పాల్గొననున్న ఏపీ బాలికల జట్టు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ పోటీల్లో పాల్గొననున్న బాలబాలికల జట్టుకు అనకాపల్లిలో శిక్షణ మంగళవారంతో ముగిసింది. సెప్టెంబరు 30 నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. వెనబడిన తరగతుల గురుకుల క్రీడా మైదానంలో ఈనెల 16 నుంచి శిక్షణ ఇస్తున్నారు. బాలికల విభాగంలో కె.జ్యోతిక, హెచ్.స్పందన, హెచ్.దీక్షిత (అనంతపురం), ఆర్.సంస్కృతి (పశ్చిమగోదావరి), కె.ఇందు (విజయనగరం), పి.శ్రావణి (శ్రీకాకుళం) ఉన్నారు. బాలుర విభాగంలో ఎన్.గౌతమ్ సంజయ్ (అనంతపురం), ఎస్.సాయికుమార్ (విజయనగరం), కె.శివశంకర ప్రసాద్, సత్యనారాయణ (తూర్పు గోదావరి), జి.మహీదర్ (అనంతపూర్), ఎస్.సాయికుమార్ (విజయనగరం), డి.రోహిత్‌కుమార్ (విశాఖపట్నం) ఉన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ, వాలీబాల్ క్రీడాకారులు యల్లపు గోవింద, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పి.రమణారావు, శిక్షకులు బి.రాజు ఆకాంక్షించారు.




**పర్యావరణ పరిరక్షణకు ముందడుగు**

**పాయకరావుపేట మండలంలోని పాల్మన్‌పేట తీరప్రాంతాన్ని స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు తీరంలో మంగళవారం స్వచ్ఛతే సేవలో భాగంగా వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షణకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పి.భాస్కరరావు, జి.తాతయ్యనాయుడు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పాయకరావుపేట**

# దారులపై రక్తధార!!






**నగరంలో రోడ్డు ప్రమాదాలతో కలవరం**

**ఏటా 300 మందికి పైగా మృత్యువాత**

**అతివేగం, మత్తు, నిర్లక్ష్యమే ప్రధాన కారణాలు**

**'బ్లాక్ స్పాట్స్'పై సమన్వయం లేని శాఖలు**

**మత్తు**

బీచ్ రోడ్డులో ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో ఓ రోజు రాత్రి మద్యం మత్తులో కారు నడపడంతో అదుపుతప్పి డివైడర్ దూకి అవలి వైపున్న రోడ్డు మీదికి దూసుకెళ్లింది. ఆపై ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరితోపాటు, కారులో ఉన్న ఇద్దరు యువకులతో కలిపి మొత్తంగా నలుగురు మృతి చెందారు.

**అతివేగం**

ఇటీవల బీఆర్‌టీఎస్ రహదారిలో ఐటీఐ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో అదుపుతప్పి తలకు గాయాలై ఓ యువకుడు మృతి చెందాడు. కొన్ని రోజుల క్రితం అతివేగం అదుపు చేయలేక ఎన్ఏడీ, తెలుగుతల్లి వంతెనపై నుంచి ద్విచక్ర వాహనాలతో సహా కిందికి పడిన ఘటనల్లోనూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

**నిర్లక్ష్యం**

కొద్ది రోజుల కిందట భీమిలి నారాయణరాజుపేటలో ఓ ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా టైర్ల కింద పడి ఐదేళ్ల బాలుడు దుర్మరణం పాలయ్యాడు. 2023 నవంబరులో ద్వారకా నగర్ వద్ద సిగ్నల్ పనిచేయని సమయంలో.. విద్యార్థులతో ఆటో వేగంగా రాగా... లారీ ఢీకొట్టిన ఘటన తీవ్ర కలకలం రేపింది.

ఈనాడు–విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

రోడ్డు ప్రమాదాలతో విశాఖ నగరం వణికిపోతోంది. నిత్యం నెత్తురోడుతోన్న రహదారులను చూసి ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. గంజాయి, మద్యం మత్తు, అతివేగం, నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు బలవుతున్నాయి. సరాసరిన రోజుకు ఒకరిద్దరి ప్రాణాలు గాల్లో కలుస్తుండటం కలవరపెడుతోంది.

**నగరంలో...**

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి: 75 కి.మీ.

బీఆర్టీఎస్ రహదారి: 35 కి.మీ.పైగా

నగరంలో అంతర్గత ప్రధాన రహదారులు: 150 కి.మీ. మేర



ప్రతి రోజూ తిరిగే వాహనాలు: 5 లక్షలకుపైగా..

**ప్రమాదాలకు కారణాలివే..**

- పగటి వేళల్లో భారీ వాహనాలు నగరంలోకి రావడం.
- కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయక, కానిస్టేబుళ్లు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వాహన చోదకులు దూసుకెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.
- మద్యం మత్తు గుర్తించే బ్రీత్ అనలైజర్స్ తనిఖీలు చాలా చోట్ల కేవలం ద్విచక్ర వాహనాలకే పరిమితం చేస్తున్నారు.
- నగరంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగకపోవడంతో గుంతల్లో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ప్రధాన మార్గాల్లోని గోతులూ ప్రమాదాలకు హేతువవుతున్నాయి.



జాతీయ రహదారిపై ప్రమాదం

**అందరూ దృష్టిసారించేదెప్పుడు..?**

నగర కమిషనరేట్ పరిధిలో అత్యధిక సంఖ్యలో ప్రమాదాలు జరిగే 'బ్లాక్ స్పాట్స్' 68 వరకు గతంలో గుర్తించారు. అత్యధికంగా గాజువాక పరిధిలో ఉన్నాయి. ప్రధానంగా పారిశ్రామిక ప్రాంతాల్లో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, జాతీయ రహదారికి ఆనుకుని నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు కూడా ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నవిగా తేల్చారు. తెలుగుతల్లి పైవంతెనపై రైల్వేస్టేషన్ వైపు వెళ్తున్న సమయంలో 60 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వాహనం నడిపితే ప్రమాదాలు జరుగుతున్నట్లు స్పష్టమైంది. ఇలా గుర్తించిన సాంకేతిక పరమైన అంశాలను జీవీఎంసీ, ఎన్‌హెచ్, పోలీసు శాఖలు సమన్వయంగా పరిష్కరించాల్సి ఉన్నా ఆశించినంత కసరత్తు కనిపించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

## డీఎల్ఎస్ఏలో ఇంటర్వ్యూలు 30కి వాయిదా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్)లో ఈనెల 26, 27 తేదీల్లో ఆఫీసు అసిస్టెంట్(03), రిసెప్షనిస్ట్ కమ్ డేటా ఎంట్రీఆపరేటర్ (01), ఆఫీసు సబార్డినేట్ (03) ఉద్యోగాలకు జరగాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయని జిల్లా న్యాయసేవల సాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలను ఈనెల 30న సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిమిత్తం అభ్యర్థులు అదే రోజు మధ్యాహ్నం 3గంటల లోపు జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌కు చేరుకోవాలని సూచించారు.

## పలు రైళ్ల రీ షెడ్యూల్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు (రీషెడ్యూల్) వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-హతియా (12836) ఎక్స్‌ప్రెస్ ఈనెల 24న ఉదయం 8.50 గంటలకు బదులు 3.10 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు.., విశాఖ-సికింద్రాబాద్ (20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 24న మధ్యాహ్నం 2.35 గంటలకు బదులు 1.55 గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారు.

## 400 సీసీ బైక్‌పై అతివేగం.. ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

విశాఖపట్నం (మాధవధార), న్యూస్‌టుడే: ఎక్కువ సీసీ సామర్థ్యం కలిగిన వాహనాన్ని నిలువరించ లేకపోవడం, అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలు తీసింది. విశాఖ నగరంలో మంగళవారం ఉదయం జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖ సీతంపేట ప్రాంతానికి చెందిన గరుగుబెల్లి ముకుల్‌సాయి ప్రవీణ్ (20) బెహర కాలేజీలో చదువుతున్నాడు. అతడి తల్లిదండ్రులు ఊరు వెళుతుండటంతో దొండపర్తి ప్రాంతానికి చెందిన స్నేహితుడు దువ్వపు ప్రశాంత్ (20)తో కలిసి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో వెల్ఫేర్ కాలేజీలో చదువుతున్న మరో స్నేహితుడు నడగాన మహేష్ (20)కోసం కప్పరాడ వెళ్లారు. వీరు ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై ప్రవీణ్ ఇంటికి బయలు దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేగంగా వెళ్తుండగా తాటిచెట్లపాలెం సమీపంలో సంజీవయ్యనగర్ వద్ద ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో ముగ్గురు ఒక్కసారిగా మూడు వైపులా తుళ్లిపోయారు. డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్ గుండె,



సాయిప్రవీణ్ డి.ప్రశాంత్ (పాత చిత్రాలు)

తలపై, మధ్యలో కూర్చున్న ప్రశాంత్ తలకు బలంగా గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చివర కూర్చున్న మహేష్ మరో వైపు తుళ్లిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం సంఘటన ప్రదేశం నుంచి 300 మీటర్ల దూరం వెళ్లి ఆగింది. స్థానికులు గాయాలైన మహేష్‌కు ప్రాథమిక చికిత్స అందించారు. సంఘటన ప్రాంతానికి చేరుకున్న కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ఏ.దాశరథి ప్రమాద కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**అతి వేగమే ప్రమాదానికి కారణం**

ఉదయం పూట జాతీయ రహదారి ఖాళీగా ఉండటంతో అతి వేగంగా డ్రైవింగ్ చేయడంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రవీణ్ 400 సీసీ ఈ బైక్‌ను అతి వేగంగా నడిపి, కంట్రోల్ చేయలేక అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. ఇటువంటి బైక్‌లు నడిపేటప్పుడు వాహనంపై అవగాహనతో పాటు, వేగంగా వెళ్లేటప్పుడు కంట్రోల్ చేసే పద్ధతి తెలిసి ఉండాలి. కానీ, కొత్తగా కొనుగోలు చేసిన ఈ బైక్‌పై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో, వాహనాన్ని అదుపు చేయలేక ఈ ప్రమాదం సంభవించినట్లుగా పోలీసులు చెబుతున్నారు.



తీవ్ర గాయాలైన ఎన్.మహేష్

**తండ్రి వారించినా..**

ప్రమాదంలో మృతి చెందిన ప్రవీణ్ తండ్రి లక్ష్మణరావు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి. నెల రోజుల క్రితమే కుమారుడికి ఆయన 400 సీసీ ఈ బైక్‌ను కొనుగోలు చేశారు. తండ్రి ఈ బైక్ వద్దని ఎంత వారించినప్పటికీ ఇంట్లో తల్లి, కుమారుడు ఒప్పుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రూ.3.50 లక్షలతో ఈ బైక్‌ను కొనుగోలు చేశారు. ఇలా ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## వైకాపా ముంచేస్తే.. కూటమి శ్రమిస్తోంది: హోం మంత్రి

కోటవురట్ల, న్యూస్‌టుడే: వైకాపా అయిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసినా రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. కోటవురట్ల మండలం పి.కొత్తపల్లిలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పందూరు సమీపంలో ఉన్న ఇందేశమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపికతో కార్యక్రమానికి హాజరయ్యారు. గత వైకాపా పాలనలో అవినీతి పాలన జరిగిందనే ఆరోపణల మేరకు, అర్హులకు అందుతున్న సంక్షేమ పథకాలపై క్షుణ్నంగా పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఎన్ఆర్‌జీఎస్ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి చేయడం మానేశారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అంతటా ఒకేసారి గ్రామసభలను నిర్వహించి, 4,500 కోట్ల విలువైన పనులను గుర్తించామని పేర్కొన్నారు. డ్రైనేజీలతోపాటు, సీసీ రోడ్లు, రైతులకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. వైకాపా పోలవరం ప్రాజెక్టు, అమరావతిలను పూర్తిగా మరిచి



సభలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

పోయిందన్నారు. రూ. 1000 కోట్లు ఆరోగ్యశ్రీ బకాయిలుంటే, కూటమి అధికారంలోకి వచ్చాక రూ. 600 కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలను ఇస్తున్నామన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఒక వ్యాపారవేత్త అని, రాజకీయాన్ని కూడా వ్యాపారంగా మార్చేశారని విమర్శించారు. ఎంతో పవిత్రంగా భావించే తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో కూడా కల్తీ చేశారని ఆరోపించారు.

▼ పాయకరావుపేట నియోజకవర్గంలో గత తెదేపా హయాంలో వేసినా రోడ్లు, డ్రైనేజీలే తప్ప వైకాపా పాలనలో ఎక్కడైనా అభివృద్ధి జరిగితే చూపించాలన్నారు. జల్లూరు, పందూరు వంతెనలను అసంపూర్తిగా వదిలేశారని, అధికారంలోకి వచ్చిన తరవాత జల్లూరు వంతెన నిర్మాణ పనులు చేస్తున్నామని వివరించారు. కోటవురట్ల మండలంలో ఉన్న సమస్య పరిష్కారమే కాకుండా అభివృద్ధి పనులు చేయడానికి రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. మరో రూ. 3 కోట్లు మంజూరు చేస్తానని చెప్పారు. పి.కొత్తపల్లిలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడమే కాకుండా, మంచినీరు, ఎన్ఆర్‌జీఎస్ ద్వారా రైతులు పొలాలకు వెళ్లే మార్గాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనలను పరిశీలించారు. 'ఇది మంచి ప్రభుత్వం', 'పొలం పిలుస్తుంది' గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆర్డీఓ జయరాం, తెదేపా మండల కమిటీ అధ్యక్షులు జానకీ శ్రీను, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, జనసేన నాయకులు తోట నగేష్, సింగంపల్లి శ్రీనివాసరావు, తెదేపా నాయకులు సుంకర బాబ్జి, నారాయణమూర్తి, నాని బాబు తదితరులు పాల్గొన్నారు.

## 90 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి కూటమి ప్రభుత్వం 90 శాతం రాయితీపై బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను అందిస్తోందని జిల్లా ఉద్యానశాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు. హరిపాలెం, కొండకర్ల గ్రామాల్లో మంగళవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. కొబ్బరి, జీడిమామిడికి పంటల విస్తరణ పథకం అమలులో ఉందన్నారు. ఏఓ శంకర్‌గోవింద, ఏఈఓ సూర్యనారాయణ, జిల్లా వనరుల కేంద్రం అధికారి తులసీమణి తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి బాబ్జీ, జి.ఫణీంద్ర కుమార్ తెలిపారు. అనకాపల్లి సీపీఐ భవనంలో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు జిల్లా ప్రథమ మహాసభ జరుగుతుందన్నారు. విద్యార్థి, విద్యా సంస్థల సమస్యలపై పూర్తి స్థాయి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ప్రతినిధులు జగదీష్, సింహాద్రి, బాలేపల్లి వెంకటరమణ, రాజాన దొరబాబు, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.



పత్రికలను విడుదల చేస్తున్న ప్రతినిధులు

## తిరుమల లడ్డూ కల్తీ క్షమించరాని నేరం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూను కల్తీ చేయడం క్షమించరాని నేరమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. లడ్డూ కల్తీ చేసి తిరుమలను అపవిత్రం చేయడంపై నెహ్రూచౌక్ కూడలిలో మంగళవారం కూటమి ఆధ్వర్యంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ లడ్డూ తయారీలో జంతు అవశేషాలతో తయారైన కొవ్వును గతంలో వైకాపా ప్రభుత్వం వినియోగించడం దుర్మార్గమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ కల్తీ వ్యవహారంలో జగన్ ప్రమేయం ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు లడ్డూలో జంతు అవశేషాలకు చెందిన కొవ్వుతో తయారైన నెయ్యిని వినియోగించారని తేల్చాయన్నారు. 1857లో సిపాయిల తిరుగుబాటులో తూటాల తొడుగులకు జంతువుల కొవ్వును ఉపయోగించడం వల్ల పెద్ద దుమారం రేగిందన్నారు. ఇది ఆచార వ్యవహారాలకు సంబంధించిన విషయమన్నారు. గత వైకాపా ప్రభుత్వం అన్నింటిలోనూ అవినీతికి పాల్పడిందన్నారు. జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని అడ్డంగా దోచేశారన్నారు. డబ్బు సంపాదనే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ధ్యేయంగా అడ్డదారులు తొక్కారన్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీలా గోవింద్ సత్యనారాయణ మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామిని అన్ని మతాలకు చెందిన వారు అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటారన్నారు. లడ్డూ కల్తీ వ్యవహారంతో భక్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రసాదంలో అవినీతికి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమాన్ని ఏనాడు జగన్ పట్టించుకోలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ వైకాపా పాలనలో అన్యమతస్తులకు తిరుపతిలో చోటు కల్పించారన్నారు. బాధ్యులందరిపైనా విచారణ చేయాలన్నారు. తిరుమతి ఆస్తులను అడ్డంగా దోచేశారన్నారు. కూటమి నాయకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధికి రూ.1.53 లక్షలు అందజేత

కె.కోటపాడు, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం కె.కోటపాడుకు చెందిన అయ్యన్న విద్యా సంస్థలు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1.53 లక్షలు అందజేశాయి. ఈ మొత్తాన్ని చెక్కు రూపేణా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి విశ్రాంత ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు చేతుల మీదుగా విద్యా సంస్థల అధినేత ఖాసిం మంగళవారం అందజేశారు. విరాళాలు సేకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. తెదేపా, భాజపా నాయకులు పైలా ప్రసాదరావు, రొంగలి మహేష్, చల్లా సత్యనారాయణమూర్తి, సీఐ పైడపునాయుడు, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి చెక్కు అందజేస్తున్న ముర్రు ముత్యాలనాయుడు, ఖాసిం, పైలా ప్రసాదరావు తదితరులు

**ఆ పదవి నాకొద్దు: పీవీజీ కుమార్**

చీడికాడ, దేవరాపల్లి: పర్యటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పదవి తనకొద్దని మాడుగుల నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పీవీజీ కుమార్ పేర్కొన్నారు. ఎప్పటికీ పార్టీ విధేయుడిగా, కార్యకర్తగానే కొనసాగుతానన్నారు. ఈ విషయాన్ని అధిష్ఠానానికి ఫోన్ ద్వారా తెలియజేసినట్లు 'న్యూస్‌టుడే'తో చెప్పారు.



## విశాఖ ఉక్కులో ప్రమాదం

**అధికారికి తీవ్ర గాయాలు**

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం ఎస్ఎంఎస్-1(స్టీల్ మెల్టింగ్ షాప్-1) లాడిల్ ప్రిపరేషన్ బే(ఎల్‌పీ బే)లో మంగళవారం జరిగిన ప్రమాదంలో సీనియర్ మేనేజర్ సీహెచ్.మల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కార్మిక నాయకులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం కంట్రోల్ రూమ్‌లో పని చేసే ఉద్యోగి హాజరు కాకపోవడంతో, ఉదయం ఏ-షిఫ్ట్ విధులకు వెళ్లిన మల్లేశ్వరరావు అక్కడి పనులు పర్యవేక్షిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బ్లాస్ట్‌ఫర్నెస్ నుంచి హాట్‌మెటల్ (సుమారు 1500 డిగ్రీల వేడితో..) ఎస్ఎంఎస్‌కు వచ్చింది. ట్రాన్స్‌ఫర్ కార్ నుంచి నేరుగా కన్వర్టర్‌లో పోసిన మెటల్‌కు వివిధ మిశ్రమాలు కలిపారు. తర్వాత లాడిల్‌లో పోసి మౌల్డింగ్ యూనిట్‌కు తరలించే క్రమంలో మెటల్ ఒక్కసారిగా పేలిపోయింది. భారీ శబ్దం రావడంతో ఏం జరిగిందోనని... కంట్రోల్ రూమ్‌లో ఉన్న మల్లేశ్వరరావు బయటకు వస్తుండగా... కాలికి ఇనుప రాడ్డు తగిలి కింద పడిపోయారు. పేలిన హాట్ మెటల్ ఆయనపై పడడంతో 90 శాతంపైగా శరీరం కాలిపోయింది. తోటి కార్మికులు వెంటనే స్టీల్ జనరల్ ఆసుపత్రికి, అక్కడ నుంచి నగరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఉక్కు అధికారులు సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు.




మల్లేశ్వరరావు (పాతచిత్రం)

## జీవీఎంసీ సీఈగా శివప్రసాదరాజు

**ఏఈ, డీఈఈలకు బదిలీలు**

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన ఇంజినీరుగా శివ ప్రసాదరాజును నియమిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీకి చెందిన ఎస్ఈ వినయ్‌కుమార్, వేణుగోపాలరావుకు ప్రధాన ఇంజినీర్లుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. ఎం.వినయ్‌కుమార్‌ను ఏపీయూఎఫ్ఐడీసీ ప్రధాన ఇంజినీరుగా, వేణుగోపాలరావును విజయవాడ టిడ్కోకు పంపించారు. అదే విధంగా 18 మంది సహాయ ఇంజినీర్లు, 12 మంది డీఈఈలను జీవీఎంసీ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఏళ్ల తరబడి తిష్టవేసిన వారందరినీ ఇక్కడ్నుంచి బయటకు పంపించినా, గతంలో ఇక్కడ పనిచేసిన వారినే తిరిగి జీవీఎంసీకి వేయడం గమనార్హం.



## విశాఖ మేయర్‌పై అవినీతి ఆరోపణలు

**రాజీనామాకు కూటమి కార్పొరేటర్ల డిమాండ్**

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ మేయరు గొలగాని హరి వెంకట కుమారి అవినీతికి పాల్పడ్డారని, ఆమె వెంటనే రాజీనామా చేయాలని కూటమి కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. జీవీఎంసీలో తిరుగులేని వైకాపాకు మొదటిసారి క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. మంగళవారం జరిగిన కౌన్సెల్ సమావేశంలో మేయరు అవినీతిని కూటమి కార్పొరేటర్లు బయటపెట్టారు. 'కరోనా సమయంలో మాస్కులు, ఇతర అవసరాల కోసం జీవీఎంసీకి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జీవీఎంసీలోని ఓ ఉన్నతాధికారి అందులో భారీ అవకతవకలకు పాల్పడ్డారు. పిక్నిక్‌ల పేరిట మహిళా సంఘాల సభ్యుల నుంచి రూ.5 కోట్ల మేర అక్రమంగా వసూలు చేశారు. ఈ విషయాలు బయటకు రాకుండా ఆ అధికారి గత కమిషనర్‌కు రూ.10 లక్షలు, మేయరుకు రూ.10 లక్షలు, అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శికి రూ.5 లక్షలు లంచం ఇచ్చినట్లు నాడు విశాఖ వైకాపా కార్యాలయం నుంచి తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి ఫిర్యాదు లేఖ వెళ్లింది. ఇప్పుడు ఆ లేఖ బయటపడడంతో మేయర్ రాజీనామా చేయాలని కూటమి కార్పొరేటర్లు పోడియాన్ని చుట్టిముట్టి ఆందోళన చేశారు. దీంతో సభను బుధవారానికి వాయిదా వేయాల్సి వచ్చింది.



మేయరు పోడియం వద్ద బైఠాయించి నినదిస్తున్న కూటమి కార్పొరేటర్లు

**సీతారాం ఏచూరికి సంతాపం:** ముందుగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి, కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి మృతికి సభ్యులు సంతాపం తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభ రవిబాబు, పండుల రవీంద్రబాబు, ఎంపీ గొల్ల బాబూరావు, దక్షిణం, ఉత్తరం ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు హాజరయ్యారు. స్టీల్‌ప్లాంటు ప్రయివేటీకరణపై సీఎం, డిప్యూటీ సీఎం ఉక్కు మంత్రిని కలిసేలా తీర్మానం చేయాలని సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు స్టాలిన్, గంగారావు డిమాండ్ చేశారు. వైకాపా హయాంలో ఆస్తి పన్ను మదింపు, చెత్త ఛార్జీలపై చేసిన తీర్మానాలను బయట పెట్టాలని తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు వెళ్లాల్సిన కోళ్ల వ్యర్థాలు చేపల చెరువులకు వెళుతున్నాయని హనోక్ తెలిపారు. కోళ్ల వ్యర్థాలతో రూ.కోట్లు కొట్టేశారని ఆరోపించారు.

**చికెన్ ధరలు**

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 107 | 98 |
| లైవ్ | 129 | 118 |
| డ్రెస్డ్ | 187 | 206 |
| స్కిన్‌లెస్ | 213 | 216 |

# అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట




### రైల్వే వంతెనపై గోతుల పూడ్చివేత

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కొత్తూరు పంచాయతీ ఆధ్వర్యంలో కళాశాల కూడలి పైవంతెన గోతుల పూడ్చే పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఊసలు తేలిన వంతెన విషయాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు సర్పంచి లక్ష్మి, కార్యదర్శి సుభాష్, నాయకులు వరహాలబాబు, తాడి శ్రీనివాస చక్రవర్తి, పందల శ్రీనివాసరావు, మోసూరి నర్సింగరావు, నీటిపల్లి రాజు తదితరులు గోతులు పూడ్పించారు.

### పేటలో భారీ వర్షం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాయకరావుపేటలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఐందరాకాలనీ, రెల్లికాలనీ, కంటోన్మెంట్ కాలనీ, రాజుగారిబీడు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కంటోన్మెంట్ ప్రాంతంలో పలు ఇళ్లలోకి నీరు చేరింది. చిత్రమందిర్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



కంటోన్మెంట్ కాలనీలో చేరిన వర్షపునీరు

### ఉద్యోగ భద్రత కల్పించాలి

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి): ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల సేల్స్‌మేన్లు, సూపర్‌వైజర్లు మంగళవారం శంకరం మద్యం గోదాం వద్ద ధర్నా చేశారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.

### పవన్‌కు మద్దతుగా పాదయాత్ర

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ఈనెల 28న పాదయాత్ర చేస్తున్నట్లు జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ప్రకటించారు. నక్కపల్లిలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం పాయకరావుపేట పాండురంగ ఆలయంలో పూజల తర్వాత ఉపమాక వెంకన్న ఆలయం వరకు 20 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించనున్నామని తెలిపారు. నాయకులు ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పిక్కి స్వామి, పాము గణేష్ పాల్గొన్నారు.

### ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా కేశవ

ఎలమంచిలి: ఎస్ఎఫ్ఐ మండల కమిటీ అధ్యక్షుడిగా ఆర్.కేశవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు మంగళవారం ఎలమంచిలిలో నిర్వహించారు. కార్యదర్శిగా మణికంఠ, ఉపాధ్యక్షులుగా రవిని ఎన్నుకున్నారు.

### 20 శాతం దసరా బోనస్ ఇవ్వాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం సెజ్‌తోపాటు ఫార్మాసిటీ పరిధిలో పనిచేసే కార్మికులకు 20 శాతం దసరా బోనస్‌ను అక్టోబర్ జీతంలో కలిపి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రతినిధులు ఆర్.సత్తిబాబు, నూకినాయుడు, మోటూరు అప్పలరాజు, దేశంశెట్టి శ్రీనివాసరావు, మామిడి నాయుడు పాల్గొన్నారు.

### దొంగగెడ్డ సమస్య పరిష్కరించరూ!

కొత్తూరు(అనకాపల్లి): దొంగగెడ్డలో వ్యర్థాలు తొలగించి నీటి ప్రవాహం సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని నాయకులు పెదపాటి సతీష్, దొడ్డి రమణ, వేజ్ల వర్మ కార్యదర్శి సుభాష్‌ను కోరారు. అనంతరం గెడ్డతో పాటు పరిసరాలను పరిశీలించారు.

### నిధుల స్వాహాపై విచారణ చేయండి

అచ్యుతాపురం: పూడిమడక పంచాయతీ పరిధిలో ఖర్చు చేసిన సీసీరోడ్ నిధులపై విచారణ చేయించాలని ఈ గ్రామానికి చెందిన ఎరిపల్లి శ్రీను కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. 2019 నుంచి ఈ స్వాహా కొనసాగుతోందన్నారు.

### ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పాఠశాలలకు విద్యార్థులు తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ ఎస్సై బి.రామకృష్ణ కోరారు. ఎలమంచిలిలో ఆటో డ్రైవర్లకు ఆయన అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ

### కార్యాచరణ రూపకల్పన

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలోని గొర్రెలు, మేకల ఆరోగ్య పరిరక్షణ, సంరక్షణకు పక్కా ప్రణాళికలతో కార్యాచరణ రూపొందిస్తున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. అనకాపల్లిలో మంగళవారం జరిగిన పెంపకందారుల సహకార యూనియన్ సర్వ సభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు.

## చాలీచాలని వసతులు..

# రోగులకు ఇక్కట్లు

### ఆరుగురు వైద్యులకు ఒకటే ఛాంబర్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు శాపంగా మారాయి. పూర్తి స్థాయిలో ఆసుపత్రి భవనాల నిర్మాణం పూర్తికాకుండానే అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభించారు. రోగులకు కనీసం కూర్చోవడానికి చోటులేని పరిస్థితి ఏర్పడింది. రోగుల తాకిడికి సరిపడా పడకలు లేవు. 50 పడకల ఆసుపత్రి 33 పడకలకు కుదించారు. ఆరుగురు వైద్యులు ఒకే గదిలో ఒక టేబుల్‌కు ఇటు ఒకరు.. అటు ఒకరు కూర్చుని రోగులకు వైద్యం అందించాల్సి వస్తోంది. ఎలమంచిలి నడిబొడ్డున 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఉండేది. ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పెరిగిన విభాగాలకు సరిపడా వసతి లేకపోవడంతో పట్టణానికి దూరంగా ఉన్న తులసీనగర్‌లో జగన్ ప్రభుత్వం ఆసుపత్రికి భవన నిర్మాణాన్ని చేపట్టింది. రెండు అంతస్తుల్లో 32 గదులు, ఇతర వసతులతో ఆసుపత్రి నిర్మించాలని యోచించారు. కింద భాగంలో ఎనిమిది భవనాలు నిర్మించారు. మిగిలినవి నిర్మించలేదు. మొత్తం నిర్మాణంలో 25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. రెండో విడతలో మిగిలిన నిర్మాణాలు పూర్తి చేయాలి. అప్పటి ప్రభుత్వం మిగిలిన పనులకు నిధులు ఇవ్వకపోవడంతో పూర్తిస్థాయిలో ఆసుపత్రి నిర్మాణం కాలేదు. ఎనిమిది నెలల కిందట ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా ప్రారంభించారు. జగన్ పాలనలోనే పాత భవనాల నుంచి కొత్త ఆసుపత్రిలోకి మార్చారు. 32 గదులు ఉండాల్సిన చోట 8 గదులే ఉన్నాయి. పరికరాలతో ల్యాబ్ గది నిండిపోయింది. రక్తనిధికి అవసరమైన పరికరాలు ఉన్నా స్థలం లేక వీటిని ఏర్పాటు చేయలేని పరిస్థితి. పురుషులకు మహిళలకు వేరువేరుగా ఒక్కొక్క వార్డు మాత్రమే ఉంది. ఇది చాలక పడకలు తగ్గించారు. డయేరియా వార్డులేదు. వీరిని మామూలు వార్డుల్లోనే ఉంచుతున్నారు. ఈ ఆసుపత్రికి రోజుకు 400 నుంచి 450 వరకూ రోగులు వస్తున్నారు. ప్రసవాలు, శస్త్రచికిత్సలు, రోడ్డు ప్రమాదాల కేసులు ఇక్కడికే వస్తాయి. చాలీచాలని వసతి ఉన్న ఇక్కడ టీబీ విభాగం కూడా ఏర్పాటుకు నిర్ణయించారు. రోగులు పడుతున్న ఇబ్బందులు తీర్చడానికి అదనపు భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



ఒకే గదిలో వైద్య సేవలు అందిస్తున్న నలుగురు వైద్యులు



ఆసుపత్రిలో రద్దీ

#### ఇబ్బందులు వాస్తవమే!

చాలీచాలని భవనాల్లో ఆసుపత్రి నడుస్తోంది. ఇబ్బంది పడటం వాస్తవమే. ఆసుపత్రిలో నాలుగో వంతు మాత్రమే భవనాలు పూర్తయాయి. ఉన్న గదులనే వినియోగించుకుంటున్నాం. వైద్యులకు ఒకే ఛాంబర్ ఇబ్బందికరమే. కొత్త భవనాలు నిర్మించాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కోరతాం. రోగులకు ఇబ్బంది లేకుండా చేస్తాం.

– డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా కోర్డినేటర్, వైద్య విధాన పరిషత్, అనకాపల్లి

# అయిదేళ్ల ఇబ్బందులకు మోక్షం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే

**వైకాపా హయాంలో రహదారులకు గ్రహణం పట్టింది. రోడ్లు గుంతలుగా మారాయి. ప్రధాన రహదారులనూ పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించింది.**



ఏటికొప్పాకలో మట్టిరోడ్డు దుస్థితి

ఎలమంచిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.13 కోట్లు మంజూరు చేసింది. అయిదేళ్లుగా గ్రామాల్లో అంతర్గత రహదారుల కనీస నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారాయి. కొద్దిపాటి వర్షం కురిసినా బురదగా మారి గుంతల్లో నీళ్లు నిలిచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో 2014-19 తెదేపా ప్రభుత్వంలో నిర్మించిన సీసీ రహదారులే కనిపిస్తున్నాయి తప్ప.. వైకాపా ప్రభుత్వంలో నిర్మించిన రోడ్లు లేవు.



రుక్మిణీపురంలో కల్వర్టు ఇలా..

#### త్వరలో పనులు ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చొరవతో రహదారుల నిర్మాణం త్వరలో ప్రారంభిస్తాం. సిమెంట్ రహదారులకు ప్రాధాన్యం ఇస్తాం. నాణ్యతతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– మునిశేఖర్, పంచాయతీరాజ్, డీఈ

### శాంతిపార్కులో శ్రమదానం



పార్కులో వ్యర్థాలు తొలగిస్తున్న విద్యార్థులు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో శాంతి పార్కులో మంగళవారం స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చెత్తాచెదారం తొలగించారు. నది పరివాహక ప్రాంతంలోనూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి గిరీష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### కొత్త పడవలకు లైసెన్సులు ఇవ్వరా?

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సత్యనారాయణ ఆదేశించారు. ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాయింట్ సర్పంచి తోటి వేసి ముత్తేలు దాటినా రాయితీ జమ కాలేదని వివ్వలవం ఎంపీటీసీ సభ్యుడు బాలు సూరిబాబు ప్రస్తావించారు. కొత్త పడవలకు లైసెన్సులు ఎందుకు ఇవ్వడం లేదని కొత్తరేవుపోలవరం, వాకపాడు సర్పంచులు లోవరాజు, శ్రీను ప్రశ్నించారు. సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిట్లు లేవని ఆర్య పరీక్షలు చేయడం లేదని సైతారుపేట సర్పంచి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు శానపతి రాము తెలియజేశారు. ఎస్.రాయవరం తవ్వేసిన రోడ్లు పూర్తిచేయాలని, చిన గుమ్ములూరులో పూర్తి స్థాయి నీరు అందడం లేదని, బంగారమ్మపాలెం తాగునీటి ట్యాంకు పనులు నిలిపివేశారని సర్పంచులు భూపతి అప్పారావు, గాడి బుజ్జి, మైలపల్లి శ్రీను పేర్కొన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, ఉప ఎంపీపీలు బొలిశెట్టి గోవిందరావు, చోడిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

### వంతెనపై చీకట్లు తొలగించరూ!

కొత్తూరు (అనకాపల్లి): కొత్తూరు శారదానది వంతెనపై చీకట్లను తొలగించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ నేతలు జొన్నకోట చెన్నమూర్తి, చందాన కృష్ణ, పాలతీర్థపు రాజు, ద్వారపూడి కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి వారు వంతెనపై నిరసన తెలిపారు. దీపాలను పునరుద్ధరించాలని కోరారు.

### అధికారుల బాధ్యతల స్వీకరణ

ఎలమంచిలి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎలమంచిలి తహసీల్దార్‌గా వరహాలరావు మంగళవారం విధుల్లో చేరారు. అనంతరం అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను కలిశారు.

అనకాపల్లి పట్టణం: అనకాపల్లి పట్టణ ఎస్సైగా కె. సంతోష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మంప నుంచి ఈయన బదిలీపై వచ్చారు.

● అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కమిషనర్‌ ఒమ్మి అయ్యప్పనాయుడును రామచంద్రాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ ఎవరినీ నియమించలేదు.

### మద్యం మత్తులో ఇంటికి నిప్పు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఉప్పరాపల్లిలో ఓ వ్యక్తి పూరింటికి నిప్పు పెట్టడంతో ఇల్లు దగ్ధమైంది. ఎస్సై విభీషణరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ గ్రామానికి చెందిన శానాపతి నూకరాజు మంగళవారం తెల్లవారుజామున మద్యం మత్తులో ఇదే గ్రామానికి చెందిన శానాపతి ఆదిలక్ష్మి ఇంటికి నిప్పు పెట్టాడు. వెంటనే స్థానికులు గమనించి కేకలు వేయడంతో ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులు సురక్షితంగా బయట పడ్డారు. ఈ ప్రమాదంలో టీవీ, వాహనం పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం



అనకాపల్లి కస్పావీధిలో..

ఎలమంచిలి, అచ్యుతాపురం, మునగపాక, రాంబిల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో వందకు పైగా పనులు చేసి ప్రజల మన్ననలు పొందిందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఏటికొప్పాకలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలు అందించి స్టిక్కర్లు అంటించారు. అనంతరం సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసిన జగన్‌కి తగిన శిక్షపడేలా చేస్తారన్నారు. ఏటికొప్పాక రైల్వేగేటు సమస్య తొందరలో పరిష్కారం అవుతుందన్నారు. నాయకులు కాండ్రకోట చిరంజీవి, లాలం భవానీ, అన్నం బాబ్జీ, రాజాన శేషు, లాలం సోమినాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఖాజీపాలెంలో తెదేపా జిల్లా కార్యదర్శి పీలా తులసీరామ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు పీలా సందీప్, ధనలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. మునగపాక, తోటాడల్లో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు టెక్కలి పరశురామ్, దాడి శివ, వేగి కృష్ణ, సూరిశెట్టి అప్పలనాయుడు, పెంటకోట శ్రీరామమూర్తి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. దిమిలిలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు కొఠారు దల్లమ్మదేవి నాయకులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్రచారం చేశారు. నాయకులు ఎస్. నాయుడు, నగిరెడ్డి నాని పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణం, లక్ష్మీదేవిపేట, న్యూస్‌టుడే: అనకాపల్లి బొత్సావారివీధిలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, కస్పావీధిలో తెదేపా బీసీ సాధికార సమితి గవర కన్వీనర్ మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు.



ఏటికొప్పాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

▼ కూటమి వందరోజుల పాలనపై ఈనెల 26న పాదయాత్ర చేపడుతున్నామని జనసేన మండల పార్టీ అధ్యక్షులు భీమరశెట్టి రామకృష్ణ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు పాదయాత్ర ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో పాటు కూటమి నాయకులు అందరూ పాల్గొంటారన్నారు.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా పారదర్శకమైన పాలన అందిస్తోందని జనసేన నాయకుడు తోట నగేష్ తెలిపారు. పట్టణంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలు పంచారు. చెప్పారు. పాండురంగస్వామి దేవస్థానం మాజీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, ఎం.నారాయణరావు, ఆది, సూరిబాబు, అనిల్, మంగ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో..



ఖాజీపాలెంలో..

# విశాఖ ఉక్కును కాపాడుకుందాం

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కును కాపాడుకోడానికి కలిసి రావాలని పరిరక్షణ పోరాట కమిటీ పిలుపు ఇచ్చింది. అనకాపల్లి సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కమిటీ జిల్లా కన్వీనర్‌గా రాజాన దొరబాబు, కో కన్వీనర్‌గా ఆర్.శంకరరావు, కమిటీ సభ్యులుగా కర్రి అప్పారావు, రెడ్డిపల్లి అప్పలరాజు, బాలు గాడి, ఎం రమణ, డీడీ వరలక్ష్మి, పి మాణిక్యం, జి కోటేశ్వరరావు, కె శంకరరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణపై చర్చించారు. తాము చిత్తశుద్ధితో చేస్తున్న పోరాటానికి ఉత్తరాంధ్ర వాసులంతా మద్దతుగా నిలవాలని కోరారు. అక్టోబర్ 2 నుంచి రిలే నిరాహారదీక్షలను ప్రారంభిస్తామన్నారు.



సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

### మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

?: అనకాపల్లిలోని మసీదు వీధిలో నెలల తరబడి మురుగుకాలువపై చెత్తను తొలగించడం లేదు. – డి. రాంప్రసాద్, అనకాపల్లి

✓: కాలువపై చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి

?: అనకాపల్లిలోని గాంధీనగరం మూడో వీధిలో లైట్లు వెలగక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సమస్యను పరిష్కరించగలరు.

– ధవళ కిరణ్‌మోహన్, అనకాపలి.

✓: మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– నానాజీ, జీవీఎంసీ విద్యుత్తు విభాగం జోనల్ ఏఈ, అనకాపల్లి.

# రైతుల కోసం ఉచిత పంటల బీమా

ఎలమంచిలి, రాంబిల్లి, న్యూస్‌టుడే: రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు. ఏటికొప్పాక సమీపంలోని పొలాల్లో వ్యవసాయ అనుబంధశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. పెదకలవలాపల్లి, కొప్పుగొండుపాలెం గ్రామాల్లో ఏఓ సి.సుమంత చేపలు, రొయ్యల చెరువుల సాగును పరిశీలించారు. జలవనరులశాఖ ఏఈ కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు (అనకాపల్లి), కశింకోట, న్యూస్‌టుడే: కూండ్రం, కుంచంగి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఏడీ రామారావు, మురళి, వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రశేఖరరావు వరి పొలాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. కశింకోట మండలం బయ్యవరం, ఏఎస్‌పేట గ్రామాల్లో ఏడీ శ్రీధర్ క్షేత్ర పరిశీలన చేసి తెగుళ్ల, పురుగుల నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఏఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### కంటి ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరి

కశింకోట, న్యూస్‌టుడే: నర్సింగబిల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్యురాలు గీతాంజలి 85 మందికి పరీక్షలు నిర్వహించి 25 మందికి వివిధ శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. సర్పంచి కోన అరుణ, నాయకులు కోన నాగేశ్వరరావు, కంటి ఆసుపత్రి అధికారి వరహాలు, శిబిరం కోఆర్డినేటరు సీహెచ్.అశ్వనీకుమార్, వై. పైడిరాజు సేవలందించారు.

### ఉద్యోగులకు సత్కారం

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ జిలానీ బేగం, ఉద్యోగులు షాజీర బేగం, శ్రీకాంత్, నాయుడు బదిలీ అయిన సందర్భంగా వీరిని నాయకులు, లేఖర్ల సంఘం ప్రతినిధులు సత్కరించారు. తెదేపా మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, దార్ల కృష్ణ, మీసాల బాబులు, మురళీ, రమణ, కుమార్, శ్రీను పాల్గొన్నారు.



# చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి



ఎలమంచిలిలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



అచ్యుతాపురంలో విజేతలతో ఉపాధ్యాయులు

ఎలమంచిలి, అచ్యుతాపురం, మునగపాక, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని జనసేన పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీను కోరారు. ఎలమంచిలి కొత్తపేట జడ్పీ పాఠశాలలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. తెదేపా పట్టణశాఖ అధ్యక్షులు గొర్లె నానాజీ, కొఠారు సాంబ, కరణం రవికుమార్, గుర్రాల శేఖర్, పల్లా సత్యనారాయణ, కొఠారు నరేష్, హెచ్ఎం వై.వి.రమణ, పీడీ ఆచాళ్ల మూర్తి తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురం కేజీబీవీ, హరిపాలెం ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ప్రతిభ చూపించారు. కేజీబీవీ విద్యార్థులు చెస్, యోగా పోటీల్లో ప్రథమస్థానంలో, కబడ్డీ, అథెటిక్స్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. హరిపాలెం జడ్పీ పాఠశాల బాలబాలికల జట్లు వాలీబాల్‌లో ద్వితీయస్థానం పొందారు. అథ్లెటిక్స్‌లో బాలాశ్రీ బంగారు పతకాన్ని సాధించాడు. గణపర్తి జడ్పీ పాఠశాలలో హోరాహోరీగా పోటీలు సాగాయి. ధర్మవరం-అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థినులు అండర్-17, అండర్-14 విభాగాల్లో తలపడ్డారు. ఖోఖోలో చినగుమ్ములూరు కొరుప్రోలు, సైతారుపేట జట్లు విజయం సాధించినట్లు మండల కోఆర్డినేటర్ శ్రీను తెలిపారు.



ధర్మవరంలో..



మునగపాకలో విజేతలతో ఉపాధ్యాయులు

# దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: దశలవారీగా వార్డుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ బాకూరి ప్రసాదరాజు అన్నారు. ఎలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన ఆయన మంగళవారం 18 వార్డులో శేషుగెడ్డ, ఎడ్లగెడ్డ, రైల్వేట్రాక్ ప్రాంతాల్లో పర్యటించారు. తాగునీరు, రహదారి సమస్యలపై మహిళలు ప్రస్తావించారు. తెదేపా నాయకులు ఆడారి రమణబాబు ఇక్కడ ప్రధాన సమస్యలను కమిషనర్‌కు వివరించారు. రహదారి నిర్మించి ఈప్రాంత ప్రజల కష్టాలు తీర్చాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విశ్రాంత ప్రిన్సిపల్ ఆడారి పూరీ జగన్నాథం పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరాజు



ఆసుపత్రికి గోడపై నవరత్నాలతో జగన్ చిత్రం

## వంద రోజులైనా.. జగన్ బొమ్మలే!

కూటమి ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులు దాటింది. ఈ సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పలుచోట్ల ఇప్పటికీ జగన్ చిత్రాలే దర్శనమిస్తున్నాయి. చీడికాడ మండలం అర్జునగిరిలో గ్రామీణ ఆరోగ్య కేంద్రం వద్ద జగన్ ఫొటోతో బోర్డు ఉండటం గమనార్హం.
– న్యూస్‌టుడే, చీడికాడ


# నర్సీపట్నం
• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల


## వీధి వ్యాపారులకు స్వనిధి రుణాలు


పత్రాలు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ నాగబాబు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి రుణాలు మంజూరయ్యాయి. ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకుల నుంచి 102 మందికి రూ.20 వేలు, రూ.50 వేల చొప్పున రుణాలు అందజేశారు. బ్యాంకు మేనేజర్లు నాగబాబు, అనిల్, నాయుడు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ రమాదేవి పాల్గొన్నారు.

### తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: 35 చిన్న కథ కాదు, చిక్‌లెట్స్, గొర్రె పురాణం, ఆడి2: మత్తు వదలరా-2, ఆడి3: సరిపోదా శనివారం, బొమ్మరిల్లు, మన్యం ధీరుడు, ఆడి4: ట్రాన్స్‌ఫార్మర్స్ ఒన్, బీచ్ రోడ్డు చేతన్, రాజు: మన్యం ధీరుడు, సరిపోదా శనివారం, బంగార్రాజు: ఆయ్.. చోడవరం: శ్రీసాయి లక్ష్మి: చిన్నకథకాదు, పూర్ణా: సరిపోదా శనివారం సాయిలక్ష్మి: మత్తు వదలరా

## ఉందేమో పట్నంలో.. ఊరేమో గిరిజన పల్లె

సౌకర్యాల్లోనూ శివారునే..

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

లింగాపురం.. నర్సీపట్నం పురపాలక సంఘంలోని 20వ వార్డు పరిధిలోకి వచ్చే గిరిజన గ్రామం. పట్టణానికి 3 కి.మీ. దూరంలో ఉంది. 400 జనాభా ఉన్న ఈ గ్రామానికి చిత్తడి దారి మీదుగా వెళ్లాలి. వరాహ నది ఒడ్డు మీదుగానూ వెళ్లొచ్చు. నదిపై రూ.3 కోట్లతో వంతెన నిర్మించి నాలుగున్నరేళ్లు అవుతోంది. ఇన్నాళ్లూ అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి స్థల సేకరణ సమస్యగా ఉండేది. నాలుగు నెలల కిందట మున్సిపాలిటీ నుంచి రూ.10 లక్షలు కేటాయించి అప్రోచ్ రోడ్డుకు అవసరమైన భూమిని సేకరించారు. ఊరి వరకు ఉన్న కంకర రోడ్డు గోతులమయంగా మారింది. పాఠశాలకు ప్రహరీ, వంట షెడ్డు లేదు. మధ్యాహ్న భోజనాన్ని ఇంటి వద్దే వండి తీసుకువస్తున్నారు.


లింగాపురం వెళ్లే దారిలా..

« అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక పాత పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. సొంత భవనానికి కొలతలు వేసినా పనులు మొదలు కాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. శ్మశానవాటిక లేదు. ఐదు బోర్లున్నా పూర్తిస్థాయిలో తాగునీరందిస్తోంది ఒక్కటే. కొండగెడ్డకు రక్షణ గోడ లేదు. భారీ వర్షాలప్పుడు వరద ఊరిని ముంచెత్తుతోంది. కొండగెడ్డ మదుం శిథిలమవడంతో నీరంతా గెడ్డలోకి పోతోంది.

### నిధులు రాగానే పనులు



శాసన సభాపతి అయ్యన్న సూచన మేరకు వంతెన అప్రోచ్ రోడ్డుతో పాటు గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ.1.7 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశాం. నిధులు రాగానే పనులు మొదలుపెడతాం. బోర్లు పనిచేసేలా చూస్తాం. గ్రామంలో సమస్యలన్నీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. – జంపా సురేంద్ర, మున్సిపల్ కమిషనర్

## ఎన్నటికి పూర్తయ్యేనో!

అసంపూర్తిగా మాడుగుల - దేవపురం రహదారి

మాడుగుల, న్యూస్‌టుడే

మాడుగుల వారపు సంతకు దేవపురం, సలుగు, ఐనాడ పంచాయతీల నుంచి గిరిజన, అటవీ ఉత్పత్తులు ఎక్కువగా వస్తుంటాయి. కొండలు, గుట్టలు ఎక్కి కావిళ్లతో తీసుకువస్తుంటారు. ఇటీవల రహదారి సౌకర్యం లేకపోతే అప్పటి రాజ్యసభ సభ్యులు సుజనాచౌదరి తన కోటా నిధులు రూ. 5 లక్షలు ఐటీడీఏ ద్వారా మంజూరు చేశారు. ఈ నిధులతో మాడుగుల ఉబ్బలింగేశ్వరాలయం నుంచి దేవపురం వెళ్లడానికి మధ్యలో ఉన్న పాలగెడ్డ ప్రవాహంలో ఉన్న బండరాళ్లను తొలగించి నల్లపనుకు మీదుగా గ్రావెల్ రహదారి నిర్మించారు. గిరిజనులు కొండలు, గుట్టలు ఎక్కి దిగి రావాల్సిన యాతన తప్పింది. ఇంతటితో పనులు ఆగిపోవడంతో పూర్తిస్థాయి రోడ్డు అందుబాటులోకి రాలేదు. తారు రోడ్డు నిర్మాణం చేపడతామని పాడేరు ఐటీడీఏ పీఓ చెప్పినా కార్యరూపం దాల్చలేదు. రోడ్డు నిర్మాణం జరిగితే మాడుగుల నుంచి దేవపురం వరకు రవాణా సదుపాయం మెరుగుపడుతుందని గిరిజనులు ఆశగా ఉన్నారు. దేవపురం పంచాయతీ శివారు గ్రామాల ప్రజలు ఎక్కువగా మాడుగుల వస్తుంటారు. పూలబంద నుంచి 12వ మైలు మీదుగా పాడేరు వెళ్లేందుకు అవకాశం ఉన్నా.. మాడుగులే వస్తుంటారు. వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను విక్రయించేందుకు ఇక్కడి వారపు సంతనే విక్రయిస్తుంటారు. దేవపురం, సలుగు, ఐనాడ పంచాయతీలు పాడేరు మండలంలో ఉన్నాయని, రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.


గిరిజనం ఉత్పత్తులు తెచ్చుకునే మార్గం

### అ వీ ఇ వీ

## వైభవంగా కోటకొండమ్మ పండగ

గొలుగొండ, కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: చోద్యంలో మూడు గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా కొలిచే కోటకొండమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రాత్రి సంబరంలో భాగంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సర్పంచి గోపాలకృష్ణ పర్యవేక్షణలో సాంస్కృతిక ప్రదర్శనలు కొనసాగాయి.

## కాలువలకు నీటి విడుదల తగ్గింపు

నాతవరం: తాండవ జలాశయం నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదలను తగ్గించినట్లు అధికారులు పేర్కొన్నారు. వెదుళ్లగెడ్డ ప్రభావంపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాతవరంలో మంగళవారం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.

## అదనపు ఎస్సైగా భాస్కరరావు



బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బుచ్చెయ్యపేట స్టేషన్‌కు అదనపు ఎస్సైగా నౌడు భాస్కరరావు నియమితులయ్యారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం సీఐడీ బ్రాంచిలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

## విధుల్లో చేరిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు

రావికమతం, న్యూస్‌టుడే: రావికమతం తహసీల్దారుగా నియమితులైన డాక్టర్ బాణం వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా హీర మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడి తహసీల్దారు ఎస్.ఎ.మహేశ్వరరావు మునగపాక మండలానికి బదిలీ అయ్యారు. వెంకటరమణకు ఆర్ఐ సతీష్, వీఆర్వోలు, వీఆర్ఏలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. డీటీగా జి.అప్పలనాయుడు నియమితులయ్యారు. ఇక్కడి డీటీ ఆర్వీ మురళీధరరావు బుచ్చెయ్యపేటకు బదిలీ అయ్యారు.

కె.కోటపాడు: కె.కోటపాడు తహసీల్దారుగా భాగ్యవతి, ఎంపీడీవోగా సాంబశివరావు బాధ్యతలు స్వీకరించారు.

నాతవరం: ఎంపీడీవోగా పి.పార్థసారథి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీఓ హనుమంతరావు భీమిలి మండలానికి బదిలీ అయ్యారు.

## క్రీడల్లో బుచ్చెంపేట విద్యార్థుల సత్తా

రోలుగుంట, చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రోలుగుంట జడ్పీ పాఠశాలలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో బుచ్చెంపేట విద్యార్థులు సత్తా చాటారు. అండర్17 బాలుర విభాగంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, చదరంగం, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, ఖోఖోలో ప్రథమ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, చదరంగం, ఖోఖో, జావెలిన్ త్రోలో మొదటి స్థానం దక్కించుకున్నారు. వీరిని హెచ్‌ఎం శేఖర్, పీడీ కొండలరావు, పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఛైర్మన్ వెంకటరమణ అభినందించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల్లో గవరవరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, అథ్లెటిక్స్‌లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.


విజేతలతో హెచ్‌ఎం, సిబ్బంది

నర్సీపట్నం అర్బన్: సర్దార్ భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వసతిగృహాలు, కళాశాలల విద్యార్థులకు మంగళవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ.. యువత ఆన్‌లైన్ ఆటలు మానుకోవాలని సూచించారు.

## సెజ్ ఏర్పాటుకు సహకరించండి : ఎమ్మెల్యే


ఎ.కోడూరులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పైలా ప్రసాదరావు, అధికారులు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చీడికాడ, కె.కోటపాడు మండలాల్లో సెజ్ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎ.కోడూరు, సింగందొరపాలెం గ్రామాల్లో పర్యటించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. కె.కోటపాడు సీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరయ్యారు. సర్పంచి అక్కునాయుడు, ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో ప్రసాదరావు, ఏవో సోమశేఖర్, నాయకులు పైలా ప్రసాదరావు, మళ్లేశ్వరరావు, రొంగలి మహేష్, పూడి నారాయణమూర్తి, ఎరుకునాయుడు, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ మంచి పాలన అందుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వడ్డాదిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేసి పూర్వవైభవం తీసుకువచ్చిందని చెప్పారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ పరిశీలకులు మూర్తియాదవ్, సర్పంచి కోరుకొండ కామలక్ష్మి, ఉప సర్పంచి సూరినాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రోలుగుంట: నామినేటెడ్ పోస్టుల భర్తీలో చోడవరం నియోజకవర్గం నుంచి బత్తుల తాతయ్యబాబుకు సముచిత స్థానం దక్కడంపై రోలుగుంట మండలానికి చెందిన తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుమ్మలూరు చంద్రమౌళి, పిళ్లా బుల్లిబాబు, మద్ది రమణ, శోభ, పందార చంద్ర, బండారు శ్రీనివాసరావు, కోలుపల్లి ఈశ్వరరావు, తాడి రమేష్, రుత్తల శ్రీనివాసరావు, సుర్ల బాబులునాయుడు తదితరులు తాతయ్యబాబుకు అభినందనలు తెలిపారు.


వడ్డాదిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

## పల్లెలకు సమృద్ధిగా నిధులు

నర్సీపట్నం గ్రామీణం, దేవరాపల్లి: పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని ఆర్డీవో జయరామ్ పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ధర్మసాగరంలో సభ నిర్వహించారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, ఎంపీడీవో జయమాధవి తదితరులు ప్రసంగించారు. అనంతరం పలువురి ఇళ్లకు వెళ్లి గోడపత్రికలు అతికించారు. సామూహిక సీమంతంలో సర్పంచి కన్నయ్యనాయుడితో కలిసి పాల్గొన్నారు. దేవరాపల్లిలో ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ భాస్కరరావు, రైవాడలో మాజీ సర్పంచి చల్లా తాతయ్యలు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ పాల్గొన్నారు.

## ఎంపీటీసీ పూర్వ సభ్యుడు సాంబయ్య మృతి



రావికమతం, న్యూస్‌టుడే: మేడివాడ ఎంపీటీసీ పూర్వ సభ్యుడు, తెదేపా సీనియరు నాయకుడు వబ్రపు సాంబయ్యనాయుడు (82) మంగళవారం మృతి చెందారు. ఆయన ఉప సర్పంచిగా, భార్య చెల్లం పాప సర్పంచిగా పనిచేశారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## బెల్లం పులుపు ధ్వంసం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: బయ్యపురెడ్డిపాలెం శివార్లలో గుట్టుగా నిర్వహిస్తున్న సారా బట్టీని పట్టణ పోలీసులు మంగళవారం గుర్తించారు. సారా తయారీకి సిద్ధం చేసిన పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. మూడు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఇన్‌ఛార్జి సీఐ ఎల్.రేవతమ్మ, పట్టణ ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూపాయికే కూరగాయల మొక్కలు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మిర్చి, వంగ, టమాటా మొక్కలు ఒక్కొక్కటి రూపాయికే ఇస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎన్.రాజ్‌కుమార్ చెప్పారు. పొటాష్ లోపం నివారణకు ఆఖరి దమ్ములో 15 కేజీలు, చిరు పొట్ట దశలో 20 కేజీల పొటాష్ వేసుకోవాలని సూచించారు. ధర్మసాగరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆర్డీవో జయరామ్, జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ తదితరులు దీన్ని సందర్శించారు. వ్యవసాయ సహాయ సంచాలకురాలు శ్రీదేవి, ఉద్యాన అధికారిణి శిరీషా, ఏఓ అప్పారావు పాల్గొన్నారు.

మాకవరపాలెం, గొలుగొండ: ఈ-పంట నమోదుతోపాటు ఈకేవైసీ చేసుకుంటే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని వ్యవసాయ శాఖ జేడీ మోహనరావు రైతులకు సూచించారు. గిడుతూరులో పంట పొలాలను సందర్శించి, రైతులతో సమావేశమయ్యారు. ఏఓ చిరంజీవి పాల్గొన్నారు. సేంద్రియ సాగు దిశగా అన్నదాతలు దృష్టిసారించాలని వ్యవసాయాధికారిణి సుధారాణి సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో తెదేపా నాయకులతో కలిసి పొలం పిలుస్తోంది గోడపత్రికలను ఆవిష్కరించారు. పాతమల్లంపేటలో పొలాలను పరిశీలించారు.


రేవళ్లులో ఏడీ రవీంద్రనాథ్, రైతులు


స్టాల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరామ్ తదితరులు

### సాగునీటి సదుపాయం కల్పించండి

చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం: సలహాలు, సూచనలివ్వడమే కాదు.. పొలాలకు సాగునీరు అందేలా చూడాలంటూ రేవళ్ల రైతులు వ్యవసాయ అధికారులను కోరారు. రేవళ్లు, అన్నవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఏడీఏలు రవీంద్రనాథ్, శ్రీధర్, ఏఓ పావని, పశుసంవర్ధక సహాయకులు అచ్యుతరాము, పాల్గొన్నారు. మంగళాపురం, విజయరామరాజుపేట గ్రామాల్లో అధికారులు పంటలను పరిశీలించి చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. వ్యవసాయాధికారి భాస్కరరావు పాల్గొన్నారు.

వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులు ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఏఓ రూప సూచించారు. టి.అర్జాపురం, కొట్నాబిల్లి గ్రామాల్లో పర్యటించారు. పశు సంవర్ధకశాఖ ఏడీఏ పుష్ప, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సౌజన్య, రత్నం పాల్గొన్నారు.

రోలుగుంట, మాడుగుల గ్రామీణం, దేవరాపల్లి, చీడికాడ: రొంగలపాలెంలో వ్యవసాయ సహాయ సంచాలకురాలు శ్రీదేవి, ఏఓ విజయలక్ష్మి రైతులతో సమావేశమయ్యారు. సత్యవరం, ఒమ్మలి గ్రామాల్లో వరి సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏఓ వాసుదేవరావు రైతులకు సూచించారు. తుంపర, బిందు సేద్యంతో ఎంతో మేలు జరుగుతుందని ఉద్యాన శాఖ ఏపీడీ జి.లక్ష్మి సూచించారు. మారేపల్లి, వేచలం గ్రామాల్లో ఏఓ వై.కాంతమ్మ, చీడికాడ, చుక్కపల్లిలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాబు, ఏఓ రమాదేవి పాల్గొన్నారు.

## నూకాలమ్మ ఆలయంలో జనసైనికుల దీక్ష

గొలుగొండ, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం ఘటనపై జనసేన మండల నాయకులు నూకాలమ్మ ఆలయ మండపంలో మంగళవారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన వారిని, సహకారం అందించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూర్యచంద్ర, మండల అధ్యక్షుడు దొరబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ మండపంలో దీక్షలో జనసేన నేతలు

### ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా పాదయాత్ర రేపు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మాడుగుల కూడలి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం కాలినడకన వెళ్లి పూజలు చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణ పేర్కొన్నారు. జనసేన, భాజపా, తెదేపా నాయకులు, వీహెచ్‌పీ నాయకులు హాజరుకావాలని కోరారు. ఎంఎస్ఎమ్ఈ ఛైర్మన్ పదవి తమ్మిరెడ్డి శివశంకర్‌కు దక్కడంతో మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆ పార్టీ ఇన్‌ఛార్జి కృష్ణ, మండల అధ్యక్షుడు శివాజీ, ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, పిల్లానాయుడు, రాజు తదితరులు శివశంకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


శివశంకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కృష్ణ తదితరులు

## పాలిథిన్ వ్యర్థాల సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌కుమార్, ప్రిన్సిపల్ శాస్త్రి, విజయలక్ష్మి

మాడుగుల, న్యూస్‌టుడే: జాతీయ సేవా పథం (ఎన్ఎస్ఎస్) దినోత్సవం సందర్భంగా మాడుగుల డిగ్రీ కళాశాలలో మంగళవారం పలు కార్యక్రమాలు జరిగాయి. ప్రిన్సిపల్ సీవీఎన్ఎస్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాలిథిన్ వ్యర్థాలను సేకరించి మొక్కలు నాటారు. పైడిరాజు, షర్మిల, రమణమూర్తి, అప్పలనాయుడు, రాజు, నారాయణ, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథం దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు పిచ్చమ్మ, మాల్యాద్రి, రాధాకృష్ణ, సత్యవతి, సుధీర్, జ్యోతి, సూర్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతపై పర్యవేక్షణ అవసరం

రావికమతం, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల భద్రత విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని కొత్తకోట ఎస్సై శ్రీనివాసరావు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తకోటలోని సెయింట్ మేరీస్, విద్యాంజలి, ఆర్క్‌బర్డ్ పాఠశాలల నిర్వాహకులతో పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సమావేశమయ్యారు. బస్సులు, ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దన్నారు. పాఠశాలల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి భద్రత నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని గ్రామీణ ఎస్సై రాజారావు సూచించారు. భాష్యం పాఠశాల ఆవరణలో బడిబస్సులు, ఆటో డ్రైవర్లతో మంగళవారం సమావేశమయ్యారు. ఎంతవేగంగా వెళ్లినా ఇట్టే నియంత్రించగలమన్న అతివిశ్వాసం సరికాదన్నారు. పరిమితికి మించి పిల్లలను ఆటోల్లో ఎక్కించవద్దని స్పష్టం చేశారు. ప్రిన్సిపల్ శేషు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వాసుపత్రుల్లో అందని వైద్య సేవలు

చోడవరం పట్టణం: ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటూ కొందరు వైద్యులు ప్రైవేటుగా క్లీనిక్‌లు నడుపుతున్నారన్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదన్నారు. గత్యంతరం లేక రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## డీఎస్పీ మోహన్ బదిలీ

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ బదిలీ అయ్యారు. ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మోహన్ ఆరు నెలల కిందట నర్సీపట్నం డీఎస్పీగా వచ్చారు. ఈయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు.

## బోధనపై మరింత శ్రద్ధ చూపండి: డీఈవో


వెంకటలక్ష్మమ్మ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులంతా బోధనపై మరింత శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ సూచించారు. నర్సీపట్నం డివిజన్‌లో ఎంపిక చేసిన గణిత ఉపాధ్యాయులకు స్థానిక జడ్పీ పాఠశాలలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చూడటంతోపాటు ఎవరైనా తరచూ గైర్హాజరవుతుంటే కారణాలు తెలుసుకోవాలన్నారు. పలువురు ఎంఈవోలు పాల్గొన్నారు.

### మెరుగైన బోధన అందించాలి

రోలుగుంట, న్యూస్‌టుడే: ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలో (ఎన్ఆర్ఎస్‌టీసీ) చిన్నారులకు మెరుగైన విద్య అందించాలని జిల్లా సమన్వయకర్త ఎల్.గిరిధర్ సూచించారు. అర్ల శివారు లోసంగిలో ఇటీవల ఏర్పాటు చేసిన పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు.

## భాజపా బలోపేతానికి సభ్యత్వ నమోదు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో భాజపాను మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామచౌదరి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు సంబంధించి మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కర్రి చిట్టిబాబు, సురేంద్రమోహన్, శ్రీరామ్మూర్తి, రామరాజు, కందర్ప రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామచౌదరి

### మేమున్నాం.. మీకు తోడుగా

?: చోడవరం గాంధీ గ్రామం శాంతినగర్‌లో శ్రీ విజ్ఞాన్ పాఠశాల ఆర్చి ఎదురుగా ఉన్న రోడ్డులో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. వీటిని తొలగించకపోవడంతో నివాసితులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు.
–వెంకటేష్, సుధాకర్, సరోజిని

✓: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను ఎత్తివేయిస్తాం.
– గాడి అప్పారావు, సర్పంచి

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

## భూమికి పచ్చని రంగేసినట్లు..



మాకవరపాలెం మండలంలో వరి నాట్లు పూర్తి కావడంతో పంటపొలాలు ఆకుపచ్చని రంగుతో కళకళలాడుతున్నాయి. బుచ్చిసీతయ్యపేట సమీపంలో వరినాట్లు పూర్తయిన పొలాలు, వాటి మధ్యలో గ్రామదేవత ఆలయం చూపరులను ఆకట్టుకుంటోంది. – మాకవరపాలెం, న్యూస్‌టుడే

## బురదలో దిగబడిన లారీ.. రాకపోకలకు అంతరాయం



రావికమతం, న్యూస్‌టుడే: బీఎన్ రోడ్డులో మేడివాడ కూడలికి సమీపంలో ఓ లారీ మంగళవారం కూరుకుపోయింది. నర్సీపట్నం నుంచి రావికమతం వైపు సరకుల లోడుతో వస్తున్న లారీ రహదారి గోతిలో దిగి పైకి ఎక్కలేక ఆగిపోయింది. స్థానికులు ట్రాక్టర్‌ను తీసుకొచ్చి లారీని బయటకు లాగారు.

**తెరపై ఈనాడు**
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - మత్తువదలరా-2
స్క్రీన్-2 - గొర్రె పురాణం

## ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ఎంపీడీవో **పి.పద్మజ** మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె స్వస్థలం విశాఖపట్నం. పరవాడ ఈవోపీఆర్‌డీగా పని చేసి పదోన్నతిపై పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లినట్లు ఆమె తెలిపారు. ఇటీవల బదిలీపై సబ్బవరం ఎంపీడీవోగా నియమించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా సబ్బవరం మండలాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

# పెందుర్తి

## స్పందనకు వందనం

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: 97వ వార్డు సుజాతనగర్ దరి వెంకటాద్రినగర్‌లో నెల రోజులుగా వీధిదీపం వెలగడం లేదని 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' లో మంగళవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన ఏఈ శివ రామ్‌ప్రసాద్.. వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి: 90598 98721 వేపగుంట: 93472 79909

సబ్బవరం, న్యూస్‌టుడే

**సమస్య:** సబ్బవరం గణేష్ నగర్‌లో చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు పెరిగిపోయాయి. – జి. మహేశ్వరరావు గణేష్ నగర్‌కాలనీ సబ్బవరం

**సమాధానం:** వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకుంటాం. – కె. మూర్తిబాబు, గ్రామ కార్యదర్శి సబ్బవరం

## మ్యాన్‌హోల్ పొంగి.. దారులు మునిగి

వేపగుంట, న్యూస్‌టుడే

వేపగుంట పరిసర కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ సంప్‌లు ప్రధాన సమస్యగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు ఎక్కడికక్కడ పొంగిపొర్లుతోంది. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. ఫలితంగా రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి సమస్య వెంటాడుతోంది. ఈ దుస్థితిపై జోనల్ కార్యాలయం, స్థానిక సచివాలయం, ప్రజారోగ్య విభాగానికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరోవైపు అభివృద్ధికి నోచుకోని మట్టి రోడ్లు నారుమడుల్లా మారాయి. వాహనదారులు జారి పడుతున్నారు. రాత్రివేళ అటుగా వెళ్లలేని పరిస్థితి. అధికారులు, పాలకులు తక్షణమే తగు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా రహదారి ఇలా..

**ఎక్కడెక్కడ ఎలా అంటే..**

★ 94వ వార్డు పురుషోత్తపురంకాలనీ రహదారిలో తొలి మలుపు వద్ద భూగర్భడ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకు రావడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు అధికమయ్యాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ★ 95వ వార్డు పురుషోత్తపురం గౌరీవిశ్వేశ్వర కాలనీ ఇళ్లలోని వాడుకనీరు పోయేందుకు సరైన కాలువలు లేకపోవడంతో ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. ఆ మురుగు పోయేందుకు తాత్కాలిక చర్యలైనా తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ★ 94వ వార్డు కృష్ణరాయపురం 80 అడుగుల రహదారిలోని పురుషోత్తపురం కాలనీలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. నారుమడుల్లా మారాయి. వాహనదారులు వెళ్లలేకపోతున్నారు.



పురుషోత్తపురం కాలనీ వీధిలో పొంగుతున్న మ్యాన్‌హోల్


**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

కాలనీల్లో సమస్యలను నేరుగా పరిశీలించమని సంబంధిత సచివాలయం కార్యదర్శులకు సూచిస్తాం. ప్రాంతీయులకు అసౌకర్యం కలగకుండా తగు చర్యలు చేపడతాం. – హేమావతి, జోన్–8 జోనల్‌కమిషనరు

## పోషకాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలం

పెందుర్తి, న్యూస్‌టుడే: రోజూ పోషకాలతో నిండిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. సీడీపీవో నీలవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పోషకాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**జన ఔషధి కేంద్రం ప్రారంభం:** పెందుర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీఎం భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పాల్గొని ప్రారంభించారు. జిల్లా సహకార సంయుక్త రిజిస్ట్రార్ ప్రవీణ, డివిజినల్ అధికారి దుర్గాప్రసాద్, ఆడిట్ అధికారి శ్యామల, డీసీసీబీ సీఈవో డీవీఎస్ శర్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చిన్నారులతో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, అధికారులు

## వ్యవసాయ పథకాలపై అవగాహన

పెందుర్తి, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ పీడీ ఆశాదేవి సూచించారు. మంగళవారం పెందుర్తి మండలంలోని నరవ గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో పెందుర్తి మండల వ్యవసాయాధికారి టి. దుర్గాప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు

## పరిశ్రమల భద్రతకు పటిష్ఠ ప్రణాళికలు అవసరం

పరవాడ, న్యూస్‌టుడే: పరిశ్రమల్లో భద్రతకు పటిష్ఠమైన ప్రణాళికలు అమలు చేయాలని అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీవో), ఎల్‌సీజీ ఛైర్మన్ చిన్నికృష్ణ పేర్కొన్నారు. పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఎఎస్‌ఆర్‌ఎం) భవనంలో మంగళవారం లోకల్ క్రైసిస్ గ్రూపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికుల భద్రతకు పరిశ్రమల యాజమాన్యాలు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కంపెనీలో జరిగిన ఘోరప్రమాదం పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే వెంటనే స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వాలని తెలిపారు. కార్మికుల పూర్తి వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు.

★ కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ మాట్లాడుతూ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించి.. నివేదికలను యాజమాన్యాలు తప్పకుండా అమలు చేయాలన్నారు. మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. కర్మాగారాల ఇన్‌స్పెక్టర్ చిన్నారావు మాట్లాడుతూ పరిశ్రమల్లో ముందస్తు తనిఖీలు నిర్వహించి ఆఫ్‌సైట్, ఆన్‌సైట్ అత్యవసర ప్రణాళికలు అమలు చేయాలన్నారు. సిబ్బందికి నైపుణ్య శిక్షణ మరింత మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఏఎస్ఆర్‌ఎం జనరల్ సెక్రటరీ జెట్టి సుబ్బారావు, ఎల్‌సీజీ సభ్యులు డాక్టర్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ హనుమంతు లక్ష్మణరావు, రాకేష్‌కుమార్, 189 మంది పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో, ఎల్‌సీజీ ఛైర్మన్ చిన్నికృష్ణ



హాజరైన కంపెనీ ప్రతినిధులు

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. పెందుర్తి మండలం వి.జుత్తాడ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలను ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయుడు ఎస్‌బీవీ.సత్యకుమార్ తెలిపారు. నాయకులు మధపాడ అంజి, బొడ్డు సూర్యప్రకాశ్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పెందుర్తి ఎంపీపీ నాగమణి

## విశాఖ బాలుడు.. తిరుపతిలో అప్పగింత

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనం కోసం విశాఖ నుంచి తిరుపతికి వచ్చి ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు గుర్తించి తండ్రికి అప్పగించారు. తిరుపతి పడమర పీఎస్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన ఎం.నిరంజన్‌రావు కుమారుడు సుశాంత్(13) విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం తండ్రి హాస్టల్‌కు వచ్చి కుమారుడుని చూసి కొంత డబ్బు ఇచ్చాడు. సోమవారం ఉదయం తండ్రికి, హాస్టల్‌లో ఎవరికీ చెప్పకుండా బాలుడు బయటకు వచ్చాడు. శ్రీవారి దర్శనం చేసుకోవాలని విశాఖపట్టణం రైల్వేస్టేషన్‌కు వెళ్లి తిరుపతికి వచ్చే రైలు ఎక్కాడు. సోమవారం అర్ధరాత్రిపైన తిరుపతికి చేరుకున్నాడు. అక్కడి నుంచి అలిపిరి చేరుకుని ఒంటరిగా తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. గత నెల కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం చేసుకున్నానని.. మరోసారి తిరుమలకు రావాలనే కోరికతో వచ్చినట్లు పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి తండ్రికి సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి తిరుపతికి వచ్చిన తండ్రి నిరంజన్‌రావుకు బాలుడిని అప్పగించారు.

## విద్యార్థుల శ్రమదానం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ నివేదిత, రత్నప్రకాష్, సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

## పీహెచ్‌సీ అదనపు భవనం ప్రారంభం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థానే రూ.2 కోట్లతో నూతన భవనాన్ని నిర్మిస్తామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం సబ్బవరం పీహెచ్‌సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించిన అదనపు భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రోజుల కిందట ఆసుపత్రి సందర్శనకు రాగా.. ప్రారంభానికి అడ్డంకులను తొలగించేందుకు కలెక్టరును, డీఎంఅండ్ హెచ్‌వోను సంప్రదించి మార్గం సుగమం చేశామన్నారు. అదేవిధంగా గతంలో పీహెచ్‌సీ మరమ్మతులకు రూ.కోటి మంజూరు కాగా గుత్తేదారు సుమారు రూ.30 లక్షల మేర పని చేశారన్నారు. ప్రస్తుత భవనం 40 ఏళ్లకు పైబడి శిథిలావస్థలో ఉండటంతో మరమ్మతులకు పనికిరాదని నూతన భవనం నిర్మించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను కోరగా ప్రస్తుతం ఉన్న రూ.70 లక్షలతో పాటు మరో రూ.1.30 కోట్లతో మొత్తం రూ.2 కోట్లు ఇస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. దీంతో త్వరలోనే పాత భవనం స్థానంలో కొత్తది నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

★ స్వచ్ఛతకు శ్రీవారి లడ్డూ ఒక ఆదర్శంగా ఉంటుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జంతు సంబంధమైన నూనెలు వాడడం అమానుష దుర్మార్గమన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సిట్ ఏర్పాటు చేసి నిగ్గు తేలుస్తామనడం, ఉపముఖ్యంత్రి ప్రాయశ్చిత దీక్ష చేస్తున్నారని పేర్కొన్నారు.

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రపంచమంతా ఎంతో విశ్వాసంతో కొలిచే కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కల్తీకి పాల్పడి పవిత్రతకు భంగం కలిగించిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. నెయ్యి కల్తీపై జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా మంగళవారం సంఘీభావ దీక్షలో పాల్గొన్నారు. 97వ వార్డు జనసేన అధ్యక్షుడు శానాపతి సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన చినముషిడివాడలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పంచకర్ల పాల్గొన్నారు. తొలుత హనుమంతుడిని దర్శించుకుని పూజలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారాన్ని ఖండించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

## సబ్బవరం మండలానికి 6 ట్రాక్టర్లు మంజూరు

సబ్బవరం, న్యూస్‌టుడే: సచ్ఛభారత్ మిషన్ కింద సబ్బవరం మండలానికి రూ.36,11,766 నిధులతో 6 ట్రాక్టర్లు మంజూరైనట్లు సబ్బవరం ఈవోపీఆర్‌డీ ఒ.మహేష్ తెలిపారు. వీటిలో గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, అసకపల్లి, మొగలిపురం, అంతకాపల్లి ఆరిపాక గ్రామాలు ఉన్నాయన్నారు. వీటిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.సూర్యకుమారి, వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మిరాణి, ఎంపీడీవో పి.పద్మజ, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## పెందుర్తి పంచాయతీ రాజ్ డీఈగా రమణమూర్తి

పెందుర్తి, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్ శాఖ పెందుర్తి నియోజకవర్గం డీఈగా పీవీ.రమణమూర్తి నియమితులయ్యారు. మంగళవారం ఆయన పెందుర్తిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెందుర్తి ఏఈ స్వాతి, జేటీవో అప్పారావు, జూనియర్ సహాయకురాలు ఎల్.సత్యవతి, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



పంచాయతీ రాజ్ డీఈఈ రమణమూర్తికి పుష్పగుచ్ఛం అందించిన ఇంజినీరింగ్ అధికారులు

## రక్తదానం ప్రాణదానంతో సమానం

నరవ (వేపగుంట), న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని విశాఖ ఇంజినీరింగు కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ అన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీసం ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. సుమారు 100 మంది విద్యార్థులు రక్తదానం చేయగా.. గాజువాక అమ్మబ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది సహకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీ.వీ.ప్రదీప్‌వర్మ, కళాశాల బోర్డు డైరెక్టరు బోను బాస్కరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చిటిమిరెడ్డి వీరునాయుడు, బ్లడ్ బ్యాంక్ అధ్యక్షులు కిరణ్, మేనేజరు సాగర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, చిత్రంలో కళాశాల ఛైర్మన్ సత్యనారాయణ, అధ్యాపకులు

## కూటమి ప్రభుత్వ పాలనపై హర్షం



వాలిమెరకలో స్టిక్కర్లు అతికిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, తదితరులు

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెందుర్తి మండలం వి.జుత్తాడ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమాల ప్రచార కార్యక్రమం జరిగింది. పంచకర్ల మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అతికించి ప్రచారాన్ని ప్రారంభించారు. పెందుర్తి ప్రత్యేకాధికారి పి.శేషశైలజ, పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు, ఎంపీడీవో కొల్లి వెంకటరావు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, సర్పంచి బొడ్డు చంద్రవాణి, వాలిమెరక, సరిపల్లి ఎంపీటీసీలు సైపురాజు స్వప్న, గొల్లవిల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: 88వ వార్డు నంగినారపాడు గ్రామంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల రమణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని వివరించారు. త్వరలోనే మహిళలకు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్ సదుపాయాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా సంఘాల సభ్యులు, కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నంగినారపాడులో..



తానాం గ్రామంలో కరపత్రాలను అందజేస్తున్న సర్పంచి దేవి, ఎంపీటీసీ సభ్యులు సునీత

తానాం(పరవాడ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతో ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాలాభివృద్ధి జరుగుతుందని తానాం సర్పంచి కన్నూరు దేవి అన్నారు. సోమవారం తానాం గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 100 రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలతో పాటు మున్ముందు చేపట్టబోయే వాటి గురించి వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, అనకాపల్లి జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ, ఉపసర్పంచి వర్రి మంగలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణ పనుల ప్రారంభం

**ఈనాడు కథనానికి స్పందన**

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతి నగర్ దరి కనకదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో కల్వర్టు మరమ్మతుకు గురై రోడ్డు అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈనాడులో 'అసలే ఇరుకు.. ఆపై గుంతలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు జోన్-8 ఈఈ రత్నాకర్‌రెడ్డి, ఏఈ శివ రామ్‌ప్రసాద్ సమస్యాత్మక ప్రాంతాన్ని సందర్శించి గుత్తేదారుతో తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.13 లక్షల నిధులతో కాలువ, కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు తెలుగు యువత అధ్యక్షుడు పీలా జితేంద్ర పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

## విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు సీహెచ్.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా దినోత్సవం జరిగింది. ప్రిన్సిపల్ ఫ్లోరా, కార్యదర్శి థియోఫిలస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రాం అధికారులు మంజుల, ప్రదీప్, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న అధ్యాపకులు

## పరవాడలో భారీ వర్షం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో మంగళవారం రాత్రి 7 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పరవాడలోని వారపుసంత చిత్తడిగా మారింది. వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపైన నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇక్కట్లకు గురయ్యారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే ఈ వాన పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పరవాడ ప్రధాన రహదారి జలమయం



బొంకులదిబ్బ వద్ద..

## నేడు ఎమ్మెల్యే పర్యటన

పరవాడ, న్యూస్‌టుడే: వాడచీపురుపల్లి గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

## 27న ఏఎన్నార్ శత జయంతి వేడుకలు

ఎం.వి.పి.కాలనీ: ప్రముఖ సినీనటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఘనంగా నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో జరిగే వేడుకల్లో డాక్టర్ చక్రవర్తి సినిమాను ప్రదర్శించనున్నామన్నారు.

## గ్రామాల్లో 'పొలం బడి'

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ, వెన్నెలపాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తొలుత పరవాడలో వరి పొలాలను సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, రైతులతో కలిసి వ్యవసాయాధికారులు పరిశీలించారు. పంటకు చీడపీడలు, పోషక లోపాలున్నట్లు మండల వ్యవసాయాధికారిణి చంద్రావతి గమనించారు. వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. రైతులంతా ఈ-పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. సాంకేతిక పద్ధతులను అనుసరించి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. అనంతరం వెన్నెలపాలెంలో పర్యటించి వంగ తదితర పంటలను పరిశీలించారు.



పరవాడలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు, నాయకులు